సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



కందుకూరు నాకు ప్రత్యేకం
'కందుకూరు ప్రాంతం నాకు ప్రత్యేకం. ఉద్యోగ జీవితంలో తొలిసారిగా ట్రెయినీ డీఎస్పీగా ఇక్కడే పనిచేశాను.' అని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు.' 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,910
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,530
3 శాతం జీఎస్టీతో	రూ.5,696
సవర (8 గ్రా)	రూ.45,568

వాతావరణం
గరిష్టం/కనిష్టం
39.3 /25.9

బుధవారం గాలిలో 53 శాతం తేమ ఉంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉండవు. గురువారం అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి.



పేదల ముంగిట్లో వైద్యం

ఒకప్పుడు : పేదల ఆరోగ్యం గురించి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాల్లేవు. ఆస్పత్రులు అధ్వానంగా ఉండేవి. వసతులు శూన్యం. డాక్టర్లు, సిబ్బంది సంఖ్య అంతంత మాత్రమే.. రోగులు ఎంత ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వ పెద్దలు తమకేం పట్టనట్టు వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో : పేదల ఆరోగ్యానికి భరోసా లభించింది. కొత్త ఆస్పత్రులు నిర్మించారు. ఇంకా అనేకం కడుతున్నారు. వసతులు మెరుగయ్యాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించారు. ఎన్నో రకాల మందులు అందుతున్నాయి. వైద్యుల్ని, సిబ్బందిని నియమించారు.

- జిల్లాలో పెద్దఎత్తున పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం
- గతంతో పోలిస్తే పెరిగిన సంఖ్య
- అధునాతన భవనాల నిర్మాణం
- భారీగా పెరిగిన టెస్ట్‌లు
- మందుల లభ్యత అధికం


గాంధీనగర్ ప్రాంతంలో నిర్మించిన నూతన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

నెల్లూరు(అర్బన్): పట్టణ ప్రాంతాల్లో ప్రజల ముంగిట్లోనే వైద్యసేవలందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పెద్దఎత్తున డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టింది. డాక్టర్లతోపాటు తగిన సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఐదువేల మంది జనాభాకు ఒక ప్రాథమిక ఆస్పత్రి అనే కోణంలో నిర్ణయం తీసుకుని పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది.

ఒకే ఏడాదిలో..

కొత్త జిల్లాలో 11 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. అందులో నెల్లూరు నగరంలో 8, కావలిలో 3 ఉన్నాయి. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిన ఫలితంగా ప్రస్తుతం కొత్తగా ఒకే సంవత్సరంలో 17 ఆస్పత్రులను నిర్మించారు. ఒక్క నెల్లూరు పరిధిలో 12, బుచ్చిరెడ్డిపాళెంలో ఒకటి, ఆత్మకూరులో ఒకటి, కావలిలో ఒకటి, కందుకూరులో రెండు ఆస్పత్రులు కట్టారు. ఇప్పటికే కొన్ని అందుబాటులో రాగా ప్రజలు వైద్యసేవలు పొందుతున్నారు.

రూ.1.10 కోట్లతో..

ఒక్కో ఆస్పత్రి నిర్మాణానికి రూ.1.10 కోట్లను ఖర్చు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.80 లక్షలకు అదనంగా కార్పొరేషన్, ఆయా మున్సిపాలిటీల నుంచి ఒక్కో భవనానికి రూ.30 లక్షలకు పైగా ఇచ్చారు. రోగులకు అనుకూలంగా ఓపీ, మందులు, రక్త పరీక్షల గదులు, అడ్మిషన్ హాల్, లేబర్ రూమ్ (డెలివరీ రూమ్) ఏర్పాటు చేశారు. నెల్లూరులోనే జేవీఆర్ కాలనీ, రామచంద్రాపురం, రామ్మూర్తి నగర్ (పీసీ నాయుడు వీధి), కపాడిపాళెం, ప్రగతి నగర్, మల్లికార్జునపురం, చాకలివీధి, చంద్రమౌళి నగర్ ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తై ఆస్పత్రులు ప్రారంభమయ్యాయి. వేదాయపాళెం, రాజాగారి వీధి, రామాలయం వీధి, స్టోన్‌హౌస్‌పేటలోని రైతు బజార్ వద్ద కట్టిన భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇంకా పాతవైన వెంగళరావునగర్, వైకుంఠపురం, కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రాల స్థానంలో కొత్త భవనాలు ఏర్పాటు చేశారు. ఈ రెండింటికీ కూడా రూ.1.10 కోట్ల వంతున ఖర్చు చేశారు.

జిల్లాలో..

నిర్మాణం చేపట్టిన ఆస్పత్రుల సంఖ్య :	అందుబాటులోకి వచ్చినవి :
17	11
ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నవి : 6	

అందుబాటులో..
కొత్తగా ఏర్పాటైన అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, కో–ఆర్డినేటర్ ఒకరు, వాచ్‌మన్ ఒకరిని నియమించారు. గతంలో ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్లు ఉండేవారు కాదు. అలాగే అత్యంత నైపుణ్యం పొందిన స్టాఫ్ నర్సులకు బదులు కేవలం ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఒక డాక్టర్ మాత్రమే ఉండేవారు. ఆ డాక్టర్ సైతం థర్డ్ పార్టీ కింద ఉండడంతో ఎప్పుడు విధులకు హాజరవుతారో కూడా తెలియని పరిస్థితి. ప్రస్తుత ప్రభుత్వం పట్టణ ఆరోగ్య కేంద్రాలను విలీనం చేసుకుని థర్డ్ పార్టీ విధానాన్ని తొలగించింది. ప్రభుత్వమే నేరుగా రెగ్యులర్ డాక్టర్లను, సిబ్బందిని నియమించడంతో మంచి వైద్యం అందుతోంది.

దండిగా మందులు

గతంలో పేరుకు 60 రకాల మందులుండేవి. వాటిలో సగం కూడా అందుబాటులో ఉండేవి కావు. ప్రస్తుతం 176 రకాల మందులను ప్రభుత్వం పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. అంతే కాకుండా ఇప్పుడు 63 రకాల పరీక్షలు అందుబాటులోకి తెచ్చారు. హాస్పిటల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను కేటాయించి కనీస అవసరాల కోసం ఖర్చు చేసుకునేలా ఆదేశాలిచ్చారు. పది బెడ్లను వైద్యం కోసం ఏర్పాటు చేశారు. చిన్న పిల్లల కోసం మరో రెండు బెడ్లను పెట్టారు.


రక్తపరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది


కోటమిట్టలో నిర్మించిన ఆరోగ్య కేంద్రం

వైద్య రంగానికి పెద్దపీట



ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. అందులో భాగంగానే పట్టణాల్లో కూడా ప్రజలు మంచి వైద్యం అందించాలని పెద్దఎత్తున పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసి నిర్మించింది. ఈ కేంద్రాల్లో ప్రాథమిక వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్నాం. భవిష్యత్‌లో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో డెలివరీలు కూడా జరిగేలా చూస్తాం. ఫలితంగా సాధారణ జబ్బులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం లభించి జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి మీద భారం తగ్గుతుంది.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

న్యూస్‌రీల్

న్యాయమూర్తుల బదిలీలు
నెల్లూరు(లీగల్): జిల్లాలోని పలు కోర్టులకు అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలను నియమిస్తూ ఏపీ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు మొదటి అదనపు జిల్లా జడ్జి సి.సత్యవాణి రెండో అదనపు జిల్లా (ఏసీబీ) కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అనంతపురం జిల్లా గుత్తి ఆరో అదనపు జిల్లా జడ్జి జి.కాబర్దిని నియమించారు. నెల్లూరు ఐదో అదనపు జిల్లా (ఎస్సీ, ఎస్టీ) కోర్టు న్యాయమూర్తి ఎం.మాధురి రాజమహేంద్రవరం ఫ్యామిలీ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శ్రీనివాసులునాయక్ పీలేరు సీనియర్ సివిల్ జడ్జిగా, ఈ స్థానంలో తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.వాణిని నియమించారు. కోవూరు సీనియర్ సివిల్ జడ్జి సి.మురళీధర్ గూడూరు సీనియర్ సివిల్ జడ్జిగా, ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్న షేక్ జానీబాషాను తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు.

'ఉపాధి' లక్ష్యం 1.13 కోట్ల పనిదినాలు
నెల్లూరు(పొగతోట): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల పేదలకు ఉపాధి పనులు అండగా నిలుస్తున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1.13 కోట్ల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 38 మండలాలున్నాయి. 4.50 లక్షల మంది జాబ్ కార్డులు కలిగిన కూలీలున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 1.15 కోట్ల పనిదినాలు కల్పించారు. కూలీలకు వేతనాల కోసం సుమారు రూ.290 కోట్లు ఖర్చు చేశారు. రూ.200 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. డ్వామా పీడీ వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి సమ్మేటివ్–2 పరీక్షలు
నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు గురువారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు సమ్మేటివ్–2 పరీక్షలు జరుగుతాయి. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు క్లాస్‌రూం బేస్డ్ అసెస్మెంట్ (సీబీఏ–3), 9వ తరగతి వారికి ఎస్‌ఏ–2 పరీక్షలు నిర్వహిస్తారు. రోజుకు ఒక ప్రభుత్వ, ఒక ప్రైవేట్ పాఠశాలను ఎంఈఓ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించాలి.

గ్రామాలకు రాచబాట

- రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- ఆరు నియోజకవర్గాల్లో రూపురేఖలు మారనున్న పలు రోడ్లు
- రూ.34.5 కోట్లతో 125 కి.మీ
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక పల్లెదారుల రూపురేఖలు మార్చివేసింది. గుంతలు.. ఇరుకు రోడ్లలో అవస్థల ప్రయాణానికి స్వస్తి పలికి గ్రామీణ రోడ్ల వ్యవస్థను మెరుగుపరిచింది. ఇంకా అనేకచోట్ల రోడ్లను రాచబాటలుగా మార్చేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన రహదారుల అభివృద్ధికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు తమవంతు కృషి చేస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో చూసినవి, ప్రజలు తమ దృష్టికి తెచ్చిన ఆయా రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలొచ్చాయి. ఈ మేరకు అధికారులు ఆరు నియోజకవర్గాల్లో 125 కి.మీ మేర రోడ్ల నిర్మాణానికి రూ.34.5 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలను పంపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే పనులను ప్రారంభించనున్నారు.

ప్రతిపాదనలు పంపిన రహదారులివే..

- కావలి నియోజకవర్గ పరిధిలో అల్లూరు వయా ఇందుపూరు, పురిణి రోడ్డు అభివృద్ధికి రూ.1.80 కోట్లు, బిట్రగుంట నుంచి బ్రాహ్మణక్రాక రోడ్డుకు సంబంధించి 7.5 కిలోమీటర్లకు రూ.1.60 కోట్లు ఇవ్వాలని కోరారు.
- ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు వయా వంగల్లు, జంగాలకండ్రిక రోడ్డు 8 కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ.2.70 కోట్లు, టీకేపాడు – కలువాయి రోడ్డులో 9 కి.మీ మేర పనులకు రూ.3.60 కోట్లు, భైరవరం–చిన్నమాచనూరు రోడ్డులో రూ.1.80 కోట్లతో 9.8 కి.మీ మేర నిర్మాణం కోసం ప్రతిపాదించారు.
- ఉదయగిరి నియోజకవర్గంలోని ఆదిమూర్తిపురం – గొల్లవారిపల్లి రోడ్డు 19 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.3.50 కోట్లు, వింజమూరు – కనిగిరి – బద్వేల్ రోడ్డులో 6.5 కి.లో మేర పనులు చేపట్టేందుకు రూ.1.60 కోట్లు, పెద్దరెడ్డిపల్లి – పామూరు రోడ్డులో రూ.1.30 కోట్లతో 12.8 కి.మీ మేర రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేశారు. కే–యు–ఎస్ రోడ్డు నుంచి సిద్ధనకొండూరు రోడ్డు వరకు 9.5 కి.మీ రోడ్డు నిర్మాణం కోసం రూ.1.80 కోట్లు అవసరమని ప్రతిపాదనలు ఇచ్చారు.
- నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నెల్లూరు – ములుమూడి – తాటిపర్తి వయా గొల్లకందుకూరు రోడ్డులో 6.5 కి.మీ మేర అభివృద్ధికి రూ.3.10 కోట్లు, నెల్లూరు – ములుమూడి – తాటిపర్తి రోడ్డు నుంచి గొల్లకందుకూరు వయా సజ్జాపురం వరకు 5 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.2.45 కోట్లతో ప్రతిపాదనలు చేశారు.
- కోవూరు నియోజకవర్గంలో నెల్లూరు – మైపాడు రోడ్డు వయా కుడితిపాళెం రోడ్డులో 19 కి.మీ మేర నిర్మాణానికి రూ.4 కోట్లు, కోవూరు–ఊటుకూరు రోడ్డులో రూ.1.50 కోట్ల వ్యయంతో 4.8 కి మీ మేర రోడ్డు అభివృద్ధి.
- సర్వేపల్లి నియోజకవర్గంలో నారాయణరెడ్డిపేట – తోటపల్లిగూడూరు రోడ్డులో రూ.3.75 కోట్ల 5.5 కి.మీ మేర రోడ్డు నిర్మాణ కోసం ప్రతిపాదనలు పంపారు.

త్వరలోనే నిధులు మంజూరవుతాయి



జిల్లాలోని ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. రూ.35 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపాం. అతి త్వరలోనే నిధులు కేటాయింపులు జరుగుతాయి. వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు జరిపిస్తాం. అలాగే మరికొన్ని రోడ్ల పనులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. ప్రాధాన్యతా క్రమంలో రహదారుల అభివృద్ధి జరుగుతుంది.

– గంగాధరం, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, నెల్లూరు

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ హరినారాయణన్

రాపూరు: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మండలంలో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. తొలుత సిద్ధవరంలో జరుగుతున్న భూముల రీ సర్వేను పరిశీలించారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా సక్రమంగా సర్వే చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎన్ని భూ సర్వేరాళ్లు నాటారని ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి 940 రాళ్లు వచ్చాయని ఇప్పటివరకు 630 రాళ్లు నాటామని అధికారులు తెలిపారు. అనంతరం రాపూరు న్యూ ఎస్సీకాలనీలో ప్రాథమిక పాఠశాల, కండలేరు డ్యాంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. తర్వాత రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల స్థలాలను పరిశీలించారు. బొజ్జనపల్లిలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, తహసీల్దార్ సుభాషిణి, ఎంపీడీఓ వీరరాజు, సర్వేయర్ అశోక్, ఎంఈఓ శ్రీనివాసులు, ఏపీఎం కృష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు తదితరులున్నారు.


జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

సోమశిలలో 52.243 టీఎంసీలు
సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 52.243 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 303 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 150 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 303, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.710 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

బీసీ సమావేశంలో టీడీపీ భజన


అచ్చెన్నాయుడు మాట్లాడక ముందే ఖాళీ అయిన కుర్చీలు

- పొగిడించుకుని.. పొంగిపోయిన నాయకులు
- బీసీ సంఘాల నేతల అసంతృప్తి

నెల్లూరు(టౌన్): పేరుకది బీసీ ఐక్య కార్యాచరణ రౌండ్ టేబుల్ సమావేశం. జరిగింది మాత్రం టీడీపీ భజన. సమస్యలపై, ఇతర వాటిపై చర్చ కన్నా టీడీపీ నాయకులను పొగిడేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. తమకు నచ్చిన విధంగా మాట్లాడిన వారిని ప్రోత్సహించిన నాయకులు మిగిలిన వారిపై ఆంక్షలు పెట్టారు. దీంతో బీసీ సంఘాల నేతలు తెలుగుదేశం నేతల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జోన్–4కు సంబంధించి రాజంపేట, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. దీనికి ఎక్కువ మంది టీడీపీకి చెందిన బీసీ సంఘాల నాయకులే హాజరయ్యారు. సమావేశం మొదటి నుంచే పక్కదారి పట్టింది. బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆప్, జనసేన పార్టీలకు చెందిన బీసీ సంఘాల నేతలు హాజరు కాగా వారిలో కూడా ఎక్కువమంది టీడీపీని పొగిడేందుకే పరిమితమయ్యారు. ఆప్ నుంచి వచ్చిన నాగేశ్వరరావు టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. దీనిపై తెలుగుదేశం నేతలెవరూ అభ్యంతరం తెలపలేదు. ఆ తర్వాత బీజేపీకి చెందిన మొగరాల సురేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ బీసీ కులానికి చెందిన వారన్నారు. కేంద్రమంత్రి వర్గంలో 27 మంది బీసీలకు పదవులు కల్పించారని చెప్పారు. దీంతో టీడీపీ నాయకులు జోక్యం చేసుకుని రాజకీయాలు వద్దు.. సమస్యలపైనే మాట్లాడాలని చెప్పి అందరినీ షాక్‌కు గురి చేశారు. తెలుగుదేశం హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందంటూ ఇతర పార్టీల నాయకులు భజన చేయడం గమనార్హం. కేవలం అధికార పార్టీ వైఎస్సార్‌సీపీని విమర్శించడానికే ఎక్కువమంది పరిమితమయ్యారు. ప్రధానంగా కొంతమంది తమ వర్గాలకు జరుగుతున్న ఇబ్బందులుపై మాట్లాడుతుంటే సమయం లేదని, ఏమైనా చెప్పాలనుకుంటే కాగితంపై రాసి ఇవ్వాలంటూ సమావేశానికి అధ్యక్షత వహించిన కొల్లు రవీంద్ర చెప్పారు. సమావేశం అనంతరం కొన్ని తీర్మానాలు చేసి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు.

వెళ్లిపోయిన సంఘాల నాయకులు

సమావేశం గంటన్నర ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైంది. మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, కొల్లు రవీంద్ర, పలు బీసీ సంఘాల నేతలు మాట్లాడారు. ఎక్కువగా తెలుగుదేశం పార్టీ గురించి, పార్టీ నేతల గురించి మాట్లాడుతుండడంతో వివిధ బీసీ సంఘాల నేతలు మధ్యలోనే వెళ్లిపోయారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాట్లాడే సమయానికి చాలా సంఘాల నాయకులు వెళ్లిపోయారు.

అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : తమ ప్రభుత్వంలో అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, గ్రామంలో ఐదు నుంచి పది మంది మాత్రమే సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందడం లేదని వెల్లడించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తోడేరు పంచాయతీ వీవర్స్ కాలనీ, పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి హయాంలో తోడేరుకు చెందిన కొందరికి వీవర్స్‌కాలనీలో ఒక్కొక్కరికి ఐదు సెంట్ల స్థలాన్ని కేటాయించి ఇళ్లు నిర్మించుకునేందుకు సహకరించినట్లు మంత్రి తెలిపారు. తాను జెడ్పీచైర్మన్‌గా ఉన్న సమయంలో కాలనీలో రోడ్లు, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. ఇప్పుడు కాలనీ బాగా అభివృద్ధి చెంది యువకులు మంచి ఉద్యోగాలు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వాలు లేవన్నారు. గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సమస్యలపై ప్రజలు పెద్ద ఎత్తున వచ్చేవారని, ఇప్పుడు సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు అందుతుండడంతో అన్నివర్గాల ప్రజలు నేరుగా లబ్ధిపొందుతున్నట్లు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల పథకాలు ఆగి ఉంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహణకు ముఖ్య కారణం పథకాలు అందని వారిని గుర్తించడమేనన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం అన్నిరకాల సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనానాయక్, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, తోడేరు సర్పంచ్ అలుపూరు పెంచలమ్మ, ఎంపీటీసీ సభ్యులు సుగుణమ్మ, జి.శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ ఎ.శశిధర్‌రెడ్డి, నాయకులు వి.శ్రీనివాసులురెడ్డి, ఎం.రమణారెడ్డి, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు నూతన పాలకవర్గాలు



మాధవరెడ్డి (మర్రిపాడు)



శ్రీహరినాయుడు (వెన్నవాడ)

ఆత్మకూరురూరల్ : జిల్లాలోని పలు సహకార సంఘాలకు నూతన పాలకవర్గాలను నియమిస్తూ మరికొన్ని సంఘాలకు పాత పాలకవర్గాలను కొనసాగిస్తూ సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని వెన్నవాడ సొసైటీ చైర్‌పర్సన్‌గా గండ్లవేడుకు చెందిన కొల్లి శ్రీహరినాయుడు, భీమవరం (మర్రిపాడు) సొసైటీ చైర్మన్‌గా సోమల మాధవరెడ్డి, రాజవోలు సొసైటీ చైర్మన్‌గా కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, దువ్వూరు సొసైటీ చైర్మన్ సూరి మదన్ మోహన్‌రెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల, బట్టేపాడు సొసైటీ అధ్యక్షులుగా గతంలో పనిచేస్తున్న వాసిపల్లి లక్ష్మీరెడ్డి, బూదళ్ల వీర రాఘవరెడ్డితో పాటు పాత పాలకవర్గ సభ్యుల పదవీ కాలాన్ని వచ్చే జూలై 30 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా జిల్లాలోని వవ్వేరు సొసైటీ చైర్మన్ యర్రంరెడ్డి స్వర్ణ, తలమంచి సొసైటీ చైర్మన్‌గా దేవనబోయిన శివకుమార్, రాపూరు సొసైటీ చైర్మన్‌గా పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి, సైదాపురం సొసైటీ చైర్మన్‌గా గంగినేని శివకుమార్, ఎస్ఎస్‌వీఆర్ సొసైటీ చైర్మన్‌గా మేడా కృష్ణారెడ్డి, ముసునూరు చైర్మన్‌గా కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, పెదపుత్తేడు చైర్మన్‌గా పెనుమల్లి వెంకటరమణారెడ్డి, అల్లూరు వెస్ట్ చైర్మన్‌గా బత్తుల భక్తవత్సలరెడ్డి, పురిణి సొసైటీ చైర్మన్‌గా షేక్.సాబ్‌జాన్, సర్వాయపాళెం సొసైటీ చైర్మన్‌గా సొదాని బ్రహ్మయ్య, మద్దూరుపాడు సొసైటీ చైర్మన్‌గా తొత్తనబోయిన వేణుగోపాల్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యా యి. వీరందరికి 2023, జూలై 30 వరకు పదవీకాలం ఉంటుంది.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.85
సన్నవి	: రూ.55
పండ్లు	: రూ.35



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్ :	రూ.125
లేయర్ లైవ్	రూ.75
బ్రాయిలర్ చికెన్:	రూ.218
స్కిన్‌లెస్ చికెన్:	రూ.242
లేయర్ చికెన్:	రూ.128

క్లుప్తంగా

ఘనంగా వేమిరెడ్డి పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వేమిరెడ్డి అభిమానులు

నెల్లూరు(సెంట్రల్) : రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను నగరంలోని పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. పూనూరు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అదేవిధంగా అన్నమయ్య సర్కిల్‌లో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. పల్లిపాడు ప్రాంతంలో జయరామయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఏబీఎం కాంపౌండ్ వద్ద అల్లం రాజా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు.

జనహిత వాత్సల్యలో..

నెల్లూరు(బృందావనం) : కొండాయపాళెం రోడ్డులోని జనహిత వాత్సల్య చిన్నారుల, వృద్ధుల కేంద్రంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజును కార్తీకమాస లక్ష దీపోత్సవ కమిటీ సభ్యుడు కంజర్ల భాస్కరశర్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. దీపోత్సవ కమిటీ సభ్యులు ఎ.విజయసారథి, గంధం సునీల్‌బాబు, ఆమంచర్ల ప్రభాకర్, తిరుపాలరెడ్డి, గట్టుపల్లి పవన్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం

నెల్లూరు (టౌన్) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం ప్రారంభమైంది. స్థానిక పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలికల హైస్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మూల్యాంకనం జరిగింది. తొలిరోజు 1,200 మంది చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు విధులకు హాజరయ్యారు. తొలిరోజు ఒక్కో అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు 20 పేపర్లు మాత్రమే ఇవ్వగా, గురువారం నుంచి 40 పేపర్లను మూల్యాంకనం చేయాల్సి ఉంది. మొత్తం 14,860 జవాబు పత్రాలను తొలిరోజు మూల్యాంకనం చేశారు. డీఈఓ గంగా భవాని ఆయా పాఠశాలల్లోనే ఉండి పర్యవేక్షిస్తున్నారు.

మేలు జాతి పశువుల అభివృద్ధికి కృషి

- జేడీ మహేశ్వరుడు

బుచ్చిరెడ్డిపాళెం : మేలు జాతి పాడి పశువుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బి.మహేశ్వరుడు అన్నారు. మండలంలోని పురందరపురం గ్రామంలో బుధవారం జరిగిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య (ఆడ) దూడల పుట్టుకకు అవసరమైన వీర్యాన్ని ప్రభుత్వం రాయితీపై ఇస్తోందన్నారు. అనంతరం లేగదూడలకు సంబంధించిన యజమానులకు బహుమతులను అందజేశారు.

స్పందన అర్జీలను పరిష్కరించకుంటే చర్యలు

- కలెక్టర్ హరినారాయణన్



నెల్లూరు(అర్బన్) : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరినారాయణన్ స్పష్టం చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో స్పందన కార్యక్రమంపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలు పునరావృతం కాకూడదన్నారు. అర్జీల్లో ఆర్థిక, ఆర్థికేతర అంశాల వారీగా విశ్లేషణ చేసుకుని ఆ మేరకు పరిష్కారం చూపాలన్నారు. సచివాలయాల సేవలపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాల మేరకు ప్రగతి చూపాలన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, సీపీఓ సాశెంరాజు, స్పందన పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రీసర్వే పనులు

- జేసీ కూర్మనాథ్



సచివాలయంలో తనిఖీలు చేస్తున్న జేసీ కూర్మనాథ్

సంగం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. సంగంలోని 1, 2 గ్రామ సచివాలయాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులను పరిశీలించి సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా భూములకు హద్దు రాళ్లు నాటే కార్యక్రమం వేగంగా జరుగుతోందన్నారు. జిల్లాకు వచ్చిన 1.14 లక్షల హద్దు రాళ్లకు గానూ 62 వేల రాళ్లు ఇప్పటికే ఏర్పాటు చేశారని, నెలాఖరులోగా హద్దు రాళ్లు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కందుకూరు నాకు ప్రత్యేకం'

- ట్రెయినీ డీఎస్పీగా పనిచేశా
- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

కందుకూరు : 'కందుకూరు ప్రాంతం నాకు చాలా ప్రత్యేకం. ఉద్యోగ జీవితంలో తొలిసారిగా ట్రెయినీ డీఎస్పీగా ఇక్కడే పనిచేశాను.' అని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో స్థానిక పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ 2011లో ఉద్యోగంలో చేరిన తర్వాత కందుకూరులోనే ట్రైనీ డీఎస్పీగా పనిచేశానని చెప్పారు. ఇన్ని సంవత్సరాల తర్వాత తిరిగి ఎస్పీ హోదాలో ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎస్పీ చేత స్థానిక అధికారులు డీఎస్పీ కార్యాలయ ఆవరణలో మామిడి మొక్క నాటించారు. 'ఈ ప్రాంతంలో ఉలవపాడు మామిడి ఫేమస్ కదా, చాలా రుచిగా కూడా ఉంటాయి' అంటూ ఎస్పీ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

క్షుణ్ణంగా పరిశీలన

కందుకూరు పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లలో రికార్డులను ఎస్పీ గంటల తరబడి తనిఖీ చేశారు. పట్టణ స్టేషన్‌లో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు మూలనపడేసి ఉండడంపై ప్రశ్నించారు. వాటిని ఎందుకు బాధితులకు ఇవ్వలేకపోయారని నిలదీశారు. అనంతరం సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ కండే శ్రీనివాసులు, కందుకూరు, గుడ్లూరు సీఐలు వెంకట్రావ్, సుబ్బారావు, పట్టణ, రూరల్ ఎస్సైలు హనీఫ్, శివనాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉరేసుకుని వివాహిత..



ఆదిలక్ష్మి మృతదేహం

వెంకటాచలం : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కసుపూరులో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కసుపూరు పంచాయతీ జ్యోతినగర్‌కు చెందిన ఇనగలూరు నరేష్, ఆదిలక్ష్మి(32) దంపతులు. వారికి ఇద్దరు సంతానం. కాగా ఆదిలక్ష్మి మంగళవారం తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. కుటుంబసభ్యులు కొద్దిసేపటి తరువాత ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతుండటంతో పెద్దగా కేకలు వేశారు. చుట్టుపక్కల వారి సాయంతో ఆదిలక్ష్మిని కిందకు దింపారు. కాగా అప్పటికే ఆమె మృతి చెందింది. అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడిందా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా తెలియరాలేదు. ఆదిలక్ష్మి తల్లి పెంచలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోలీసులు బుధవారం ఉదయం పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి..

పొదలకూరు : మండలంలోని నల్లపాళెం గ్రామానికి చెందిన మెట్టుకూరు ప్రతాప్‌రెడ్డి(29) అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కరిముల్లా బుధవారం కేసు నమోదు చేసి వివరాలు వెల్లడించారు. ఏడేళ్ల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో ప్రతాప్‌రెడ్డి నడుముకు గాయమై నడవలేని స్థితిలో ఉన్నాడు. ఈ క్రమంలో అతను మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లోని పురుగు మందును తాగాడు. చికిత్స నిమిత్తం పొదలకూరు సీహెచ్‌సీకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరు రామచంద్రారెడ్డి ఆస్పత్రికి తరలించినా లాభం లేక మృతి చెందాడు.

గడ్డిమందు తాగి..



వెంకటరమణయ్య మృతదేహం

మనుబోలు : మండలంలోని పిడూరుపాళెం గ్రామంలో గడ్డి మందు తాగి బుధవారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వలమేటి వెంకటరమణయ్య(37) మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగవద్దని భార్య ఎంత చెప్పినా వినకుండా తాగుతుండడంతో కుటుంబ సభ్యులు నిలదీశారు. దీంతో మంగళవారం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణపట్నం వాసికి కర్నూలులో ఆపరేషన్



వెంకటేశ్వర్లుతో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్) : నెల్లూరు జిల్లా కృష్ణపట్నంకు చెందిన మత్స్యకారుడు వెంకటేశ్వర్లుకు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద గుండె శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కార్డియోథొరాసిక్ సర్జన్, హెచ్ఓడీ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి బుధవారం వివరాలను వెల్లడించారు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మత్స్యకార భరోసా, అమ్మఒడి వంటి ప్రభుత్వ పథకాలతో జీవితం సాఫీగా గడిచిపోతుండగా గుండెజబ్బు ఉక్కిరిబిక్కిరి చేసింది. పలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చూపించగా, ఆపరేషన్‌కు చాలా డబ్బు ఖర్చవుతుందని చెప్పడంతో భయపడి ఇంటికొచ్చేశాడు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలుసుకుని ఇటీవల అక్కడి ఆస్పత్రిలో చేరాడు. డాక్టర్ రవీంద్ర, అనస్తెటిస్ట్ డాక్టర్ కొండారెడ్డితో కలిసి ప్రభాకర్‌రెడ్డి గుండె కవాట మార్పిడి ఆపరేషన్ను విజయవంతంగా నిర్వహించారు. కాగా వెంకటేశ్వర్లు కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జ్ చేశారు.

శ్రీకృష్ణునికి పూజలు



పూజల్లో పాల్గొన్న ఎంపీ బీద మస్తాన్‌రావు

ఉలవపాడు : మండల పరిధిలోని కరేడు గ్రామంలో ఉన్న కృష్ణుని ఆలయంలో మండల అభిషేక మహోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. ఉదయం భగవత్ ప్రార్థన, నియమ సంకల్పం, కుంభారాధన, హోమాలు నిర్వహించారు. 108 కలశాలతో అభిషేకం జరిపారు. సాయంత్రం శాంతి కల్యాణ మహోత్సవం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పాల్గొని పూజలు నిర్వహించారు.

యాసిడ్ దాడి ఘటనలో ఏడుగురి అరెస్ట్

కలిగిరి : ఈనెల 4న ఓ దంపతుల మీద జరిగిన యాసిడ్ దాడి ఘటనలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కలిగిరి సీఐ సాంబశివరావు తెలిపారు. కలిగిరిలోని సీఐ కార్యాలయంలో దాడి ఘటనకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. ఉండ్రగుండ్ర నాగేంద్రబాబు కలిగిరి శివాలయంలో అర్చకుడు పనిచేస్తున్నాడు. కాగా ఓ మహిళ విషయమై నెలకొన్న వివాదంలో గునపాటి నాగార్జునరెడ్డి, అతని భార్య వెంకట రమణమ్మల మీద అర్చకుడు కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో కలిగిరికి చెందిన తాటిచెట్ల సాయికుమార్‌కు గతేడాది అక్టోబర్‌లో కొంత నగదు ఇచ్చి యాసిడ్ దాడికి పథక రచన చేశాడు. వారు విఫలం కావడంతో కలిగిరి మండలం కావలి ముస్తాపురానికి చెందిన వేళ్ల నరేష్‌ను సంప్రదించి నగదు అప్పగించాడు. నరేష్ తన స్నేహితులైన బొర్రా కార్తీక్, గుంటగాని రవివర్మ ద్వారా కావలి ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులతో యాసిడ్ దాడి చేయించాడు. ఈ ఘటనలో మొత్తం 11 మంది ఉన్నట్లు నిర్ధారించారు. వారిలో ప్రధాన నిందితుడు నాగేంద్రబాబు, సాయికుమార్, వేళ్ల నరేష్, కార్తీక్, రవివర్మ, మరో ఇద్దరిని కావలిముస్తాపురంలో మంగళవారం అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న నలుగురిని అరెస్ట్ చేస్తామన్నారు. ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.